# 3. తమలపాకు చిలకలు

'అమ్మగారూ, మీ బాబాయిగారొచ్చినట్టున్నారు. బస్సు దిగుతుంటే చూశాను' పైడమ్మ మాట విని కూడా వినపడనట్లు మొహం పెట్టి, 'సర్లే, నువ్వెళ్ళి పన్చూసుకో' అంది వెంకట్రమణ.

వీధిలో స్కూటర్ స్టార్ట్ చెయ్యడానికి రెడీ అవుతున్న సూర్యం ఆ మాట విని స్కూటర్‌కి స్టాండు వేసి లోపలికొచ్చాడు. "నేను వెంటనే స్కూటర్ మీద వెడితే ఆయన దొరుకుతాడు. మనింటికి తీసుకురానా?'' అన్నాడు పెళ్ళాంతో.

"మా తమ్ముడే పిలిపించి ఉంటాడు. మనమేదో సుఖపడిపోతున్నామని వాడికి ఏడుపు కదా. వాడే వాళ్ళింటికి తీసికెళ్ళి ఉన్నవీ లేనివీ ఎక్కించి మనింటికి ఎలాగూ పంపిస్తాడు. అంచేత బాబాయి భోజనం మూడొంతులు ఇవాళకి ఇక్కడే. బాబాయికి ఎర్ర అరటి పళ్లంటే ఇష్టం. తుని తమలపాకులంటే ప్రాణం. దూరమనుకోక మీరోసారి నెహ్రూ మార్కెట్‌కెళ్ళి అవి కొని పంపగలిగితే చాలు."

"వేరే ఎవరిచేతో పంపడమెందుకు, నేనే తెచ్చి ఇస్తాను. వచ్చేటప్పుడు దార్లో కాసేపు ఆగి పిన మావగార్ని భోజనానికి పిలిచి మరీ వస్తాను.''

"అన్నీ చెయ్యగల సమర్థులే గాని, మీ కాలేజీకి ఇంకా పావు గంట టైమే ఉంది, చూసుకోండి మరి. అయినా, మా తమ్ముడు ఏదో గొడవ పెట్టి తప్ప బాబాయిని ఇక్కడికి పంపించడు. వాటికి తగిన సమాధానం చెప్పుకుని నిర్వహించుకురావడం మీ వల్ల కాదు. నే చెప్పినవి కాస్త గుర్తుంచుకుని ఇల్లు చేరిస్తే అంతే చాలు. అన్నట్టు మరచిపోయాను. ఇవాళ శనివారం కదూ. మధ్యాహ్నం మీ ఫ్రెండు రాంబాబింట్లో పేకాట ఉంటుంది. హాయిగా అక్కడికెళ్ళి ఆడుకోక ఈ గొడవంతా మీకెందుకు చెప్పండి! మీరేదో క్యాంపుకి వెళ్ళారని బాబాయికి సర్ది చెప్పే పూచీ నాది. సరేనా'' అంటూ దగ్గరకొచ్చి మొగుడి నుదుటిన పట్టిన చెమటని పైట చెంగుతో తుడిచి సెండాఫ్ ఇచ్చింది వెంకట్రమణ.

సరిగ్గా అదే సమయంలో మరకలున్న గాజు గ్లాసులో బాబాయికి నీళ్ళ టీ ఆఫర్ చేస్తూ వెంకట్రమణ తమ్ముడు నాగరాజు అన్నదిదీ! "ఇంకా ఏం చెప్పమంటారు బాబాయ్! మా అక్కయ్య స్వార్థం రోజురోజుకీ పెచ్చు పెరిగిపోతుంది. ఓ తండ్రీ పిల్లలం అయితేనే, అదో మహారాణి, నేనో బిచ్చగాణ్ణి. నాన్నగారి పేర్న నాకు మిగిలినవి శ్రాద్ధ కర్మలూ, దానికి దక్కినవి అష్టైశ్వర్యాలూ! పోన్లెండి, దాన్నే బాగుపడనివ్వండి''.

"ఇప్పుడిలాంటి పుల్ల విరుపు మాటలెందుకు చెప్పు!"

"ఎందుకా దాన్లా తడి గుడ్డతో గొంతు కొయ్యడం చేతకాక! వాళ్ళ ఇద్దరి పిల్లలూ పెద్ద పెద్ద ఉద్యోగాల్లో అమెరికాలో స్థిరపడిపోయారు. నెల తిరిగేసరికల్లా సంచీల కొద్దీ డాలర్లు కుమ్మరిస్తున్నారు. బావ పెన్షన్ డబ్బులు మస్తుగా అందుతున్నాయి. అక్కడితో అయినా ఆశ ఆగుతుందా! ఏదో ప్రైవేట్ కాలేజీలో ప్రిన్సిపాల్ పని అఘోరించమని తగిలింది. ఏదో ఉండబట్టలేక అంటాను గానీ నాకెందుకు.

రవ్వల అన్నం వండుకుని, బంగారం చిప్పు నంజుకోమనండి. సొంత తమ్ముడే, బండెడు కుటుంబంతో అదే ఊళ్ళో ఓ పూట తింటే మరో పూట పస్తుంటున్నాడే అని ఆమాత్రమైనా జాలీ దయా లేకపోగా, నాన్న నాకిచ్చింది కూడా తనే పడేసుకుంటే ఎలా చావను చెప్పండి!"

నాగరాజు తండ్రి పరంధామయ్యకి రిటైర్డ్ జడ్జి సుందరేశం గారు ఓ విధంగా తమ్ముడి వరస. అన్నగారి కర్మలకి వచ్చాక మళ్ళీ ఇప్పుడే రావడం. ఆయన హయాంలో తీర్పిచ్చిన ఏ కేసయినా చాలావరకు ఆర్థిక అసమానతతో సంబంధం ఉన్నదే. పరంధామయ్యా ఒకప్పుడు బాగా బతికినవాడే మరి. ఈ నాగరాజు నిర్వాకంతోనే ఇంతగా చితికిపోయిన స్థితికి చేరుకున్నట్టున్నాడు. వీడికీ, వీడి పెళ్ళానికీ ఒకరితో ఒకరు కాట్ల కుక్కల్లా కలియబడ్డం తప్ప మరోటి తెలిసినట్టు లేదు. ఏకమాట ఆడుకున్నది మాత్రం ఒక్క పడగ్గదిలోనే అయుండాలి. లేకపోతే ఇంతగా ఇల్లు నిండిపోయి ఉండదు! నాగరాజు మాటల్లో మళ్ళీ సుందరేశం వర్తమానంలోకి వచ్చినట్టున్నాడు. "ఈ వయసులో మిమ్మల్ని రప్పించి ఇబ్బంది పెట్టినట్టున్నాను బాబాయి గారూ! ఎలాగూ ఇటు ప్రయాణం పెట్టుకున్నారు కదా అని దార్లో ఓ పూట దిగమని ఉత్తరం వేశాను. పెద్ద మనసు వారు గనుక ఇబ్బంది అయినా నా మాట మన్నించి దిగేరు. మీతో కాకపోతే చెప్పుకోడానికి నాకెవరున్నారని! మా నాన్నకి బాగా ఎక్కువగా ఉన్నప్పుడే ఓసారి ఇలాగే ఇంటికి వెడుతూ దార్లో ఇక్కడ బ్రేక్ చేశారు. ఆ పెద్ద వెండి కంచం నాన్న ఎవరికిమ్మన్నాడో మీ చెవితో మీరే విన్నారు కద!" సుందరేశం గారు ఆ ఉదంతం గుర్తు తెచ్చుకున్నారు. మంచం మీద ఉన్న పరంధామయ్య అటూ ఇటూ చూసి తనని దగ్గరగా పిల్చి హీనస్వరంతో ఏం చెప్పాడో తనకి జ్ఞాపకమే.

"తమ్ముడూ, ఏం సంపాదించానో, పిల్లలకేమేం ఇచ్చానో! నా రోజులు దగ్గర పడ్డాయి. నా వెండి కంచం ఒకటి-చివర్న చిన్నక్షరాలతో నా పేరు ఉన్నది - రవణ దగ్గర ఉండిపోయినట్లుంది. ఇక నా దినం తీర్చడానికి ఇంకెవరున్నారు, మా నాగులుగాడు కాక! ఆ కంచం వీడికే చెందాలని నా కోరిక. వీళ్ళిద్దరికీ క్షణం పడదనే మాట నీకు తెలిసిందే. మరి దాని దగ్గిర్నుంచి ఆ కంచం తెప్పించి వీడి చేతిలో ఎలా పెడతావో, నీదే భారం." పరంధామయ్యా గమనించి ఉండాలి మరి. ఏదో అలికిడి అయి సుందరేశం ఇటు తిరిగి చూశాడు. తలుపు చాటున నాగరాజు తచ్చాడ్డం కంట పడింది.

"ఇందులో దాచడానికేముంది! వాడికీ తెలిస్తే మంచిదేగా" అనుకున్నాడు. "అలాగే అన్నయ్యా పదిమందికీ తీర్పులు చెప్పినవాణ్ణి. ఈ చిన్న పని చెయ్యలేకపోతానా! అసలే నీ ఒంట్లో బాగులేదు. ఇలాంటివన్నీ ఇక బుర్రలో పెట్టుకోకు. నీ కోరిక నేను తీరుస్తానుగా" అంటూ చేతిలో చెయ్యి వేశాడు కూడా. అప్పుడే వెంకట్రమణకి చెప్పేడు కూడా, ఎప్పుడో పంపించేసి ఉంటుందనుకున్నాడు.

"చెబితే మీరు నమ్మరు. అంత కక్కుర్తి మనిషిని భూమ్మీద చూసి ఉండరు. ఎన్ని కబుర్లు పంపనివ్వండి, ఊఁ అన్దు, ఆఁ అన్దు; కంచం చేతిలో పెట్టదు. నాన్న గారి పేరూ, ఆయన పేర్న దాన్ని దాచుకోడం ఇలాంటి సెంటిమెంట్ల పెంట నన్నేం వెంట పెట్టదు. ఒకటా రెండా, నూరు తులాల వెండి!

అలా తక్కువ రేటుకి అమ్ముకున్నా పదిహేనువేల పై మాట! దాన్తో కొన్ని రోజులైనా మాకు హాయిగా వెళ్లిపోతాయి. అందుకు ఆఖరి ఛాన్సు చూద్దామని మిమ్మల్ని శ్రమ పెట్టేను".

"చూడు నాగులూ, 'ఔరా' అనిపించుకోకపోయినా, 'అరెరే' అనిపించుకోకుండా విధి నిర్వహణ చేసిన వాణ్ణి. న్యాయం బతికే ఉందని రుజువు చేస్తాను. వెండి కంచం తెచ్చి నీ చేతిలో పెట్టి మరీ తిరుగు ప్రయాణం పెట్టకుంటాను, సరేనా?" అని బయలుదేరిన సుందరేశంగారి వెర్రి పంతం వెంకట్రమణ ఇల్లు చేరిన పది పదిహేను నిమిషాల్లోనే కొంత సడలింపుకి లోనయింది. రెండు చేతులా ఆదరించింది. ఎక్కణ్ణుంచో ఆయన కోసం ప్రత్యేకించి తెప్పించిన భావన కలిగిస్తూ రెండు పెద్ద పెద్ద ఎర్ర అరటి పళ్ళు అందించింది. "ఏ పదేళ్ళు దాటిందో ఇంత రుచికరమైనవి తిని! ఆవిడుంటే అన్నీ చూసుకునేది. నా భోగం అంతా మీ పిన్నితోనే వెళ్ళిపోయిందనుకో! ఇద్దరు మగ పిల్లలు పుట్టగానే దానికి తెలీకుండా ఆపరేషను చేయించుకున్నానని మీ పిన్ని ఎందుకంత గోల పెట్టేదో ఇప్పుడర్థమవుతోంది. ఎంతయినా ఆడపిల్ల మనసే వేరు. ఎన్నేళ్ళు ఏ ఉద్యోగం చేస్తే ఏం లాభం, ఎంత సంపాదిస్తే ఏం సుఖం, మనసు కనిపెట్టే మనిషి లేకపోయాక!"

"మీరలా దిగులుపడితే ఎలా బాబాయ్! మేమంతా లేమా, అసలే బాగా చిక్కిపోయారు. నల్లబడిపోయారు. మీరే ఇలా డీలా పడితే ఎలా? మాకు మాత్రం మీరొకరే కదా, అటూ ఇటూ పెద్ద దిక్కు! అదేమిటి ఒక్కటే తిన్నారు. రెండో అరటి పండు అలా వదిలేశారేం?

"బాగా పెద్దవిగా ఉన్నాయి తల్లీ. పెద్దముండా వాణ్ణా ఆయాసం తన్నుకొస్తోంది. కడుపున పుట్టిన కొడుకులకీ, ఆస్తి లంకించుకునే కోడళ్ళకీ ఏమాత్రం పట్టకపోయినా ఎంతో ఆదరించావ్. అదే పదివేలు. అన్నట్టు నీతో ఓ ముఖ్యమైన పని ఉండి వచ్చాను"

"అలాగే మీలాంటి సత్పురుషులు సెలవివ్వాలే గానీ, మాలాంటి సామాన్యులం గంగలో దూకమన్నా సిద్ధమే. ముందు భోజనం కానివ్వండి. మీ మొహంలో ఎంతో అలసట కనిపిస్తోంది. ఇన్నేళ్ళకి మా ఇంటికొచ్చారు. మీలాంటి పెద్దల ఆశీర్వచనం వల్ల హాయిగానే రోజులు వెళ్ళబుచ్చుతున్నాం. సరిగ్గా సమయానికి మీ అల్లుడు పొరుగూర్లో చిక్కుబడిపోవడం ఆయన దురదృష్టం. ఫోన్ చేసినా రాలేని దూరం. ఇలా వచ్చి చుట్టపుచూపుగా వెళ్లిపోయారని తెలుస్తే ఎంతో బాధపడతారు. ఏం చెయ్యను! సరే. ముందు కాళ్లు కడుక్కోండి బాబాయిగారూ! కడుపులో ఇంత పడ్డాక ఎన్ని కబుర్లయినా చెప్పుకోవచ్చు".

ఆ కాలపువాళ్ళకి- పైన సీలింగ్ ఫ్యానూ, కింద డిన్నర్ టేబుల్ మీద అందమైన పాత్రలలో అమర్చిన ఆహార పదార్థాలూ - ఇలాంటి మెకానికల్ సరుకునచ్చదని వెంకట్రమణ ఎప్పుడో పసిగట్టింది. పీట ముందు పరచిన అరిటాకులో అన్నీ అమర్చి పక్కన కబుర్లు చెబుతూ మారు వడ్డించే ఆడమనిషి ఆప్యాయత కావాలి. ఒకప్పుడు వాళ్ళ మేనత్త ఉండేది. తర్వాత ఆ ఛార్జీ పిన్ని పుచ్చుకుంది. పొద్దుట టిఫిన్ తిని తన క్యారేజీ సర్దుకుని ఆఫీసుకెళ్ళి ఏ రాత్రో ఇల్లు చేరే ఉద్యోగినులు ఈ రోజుల్లో

పెద్దవాళ్ళకేం అమర్చగలరు! కాబట్టి తాను బాబాయికి సంతృప్తి కలగజేసేది అన్నంతోనూ, ఆధరువులతోనూ కాదనీ, ఆదరణ, ఆప్యాయతలతో అనీ వెంకట్రమణ స్పష్టంగా పోల్చుకుంది.

అప్పుడు పదకొండు గంటలైంది. "బాగా ఎండెక్కిపోయింది. నువ్వు కూడా ఎంగిలి పడకూడదుటే" అన్న సుందరేశంగారి మాట విని, "మీరొచ్చే ముందే ఓ అరడజను ఇడ్లీలు లాగించాను. రెండయే దాకా నాకు మళ్ళీ ఆకలవదు" అంటూ తప్పించుకుంది.

'అవును గాని ఒసే రవణీ, మీ నాన్న వెండి కంచం మీ తమ్ముడిదేననీ, అలా మీ నాన్న నాతో స్పష్టంగా చెప్పేడనీ ఇది వరకే నీకు చెప్పేను కదా. ఎన్ని సార్లు కబురంపినా వాడి కంచం వాడి మొహాన కొట్టవుట. నీకేం లేదా పోదా? ఇదేం దుర్బుద్ధే? అని అడుగుదామని సుందరేశం గారు రిహార్సలు చేసుకుంటుండగా పళ్ళెంనిండా తమలపాకుల సరంజామాతో వెంకట్రవణ అక్కడ ప్రత్యక్షమైంది. అవి చూడగానే ఆ ఆలోచన అర్జంటుగా వెనక్కి తప్పుకుంది. తన అత్తారిది అదే ఊరవడం చేత సుందరేశం గారి పాన్ సేవనం గురించి కూడా పిన్నిగారి నోట ఆనాడే వింది.

"కూడా కూచుని కొసరి కొసరి వడ్డించడానికే నా నడుం లాగేస్తుంది. అక్కడితోనైనా ఆపుతారా తల్లీ, మీ బాబాయి! లేత తమలపాకులు ఈనెలు తీసి, సున్నం రాసి, తగినంత వక్కపొడి మిళాయించి, టోపీల్లా చుట్టి ఒకటీ ఒకటీ అందించాలి. అందించే వాళ్లుండాలి గాని ఎన్నిచ్చినా అలా మేకలా నవలడమే గాని 'ఇక చాలు' అనే మాట ఈ జన్మకి రాదే!"

చిలకలంటారుట వాటిని. ఆ చిన్నతనంలో సరదా పడి అవెలా చుట్టాలో ఆవిడ దగ్గరే నేర్చుకున్నది. ఒకటి రెండుసార్లు సూర్యానికి అందిద్దామని ట్రైచేసింది కూడా. ఆ మొద్దు మొహానికి ఇందులో లాలిత్యం తెలిస్తేనా! 'ఏమైనా చేతిలో విద్య అనేది ఉంటే ఎప్పటికైనా పనికొస్తుందనే' మాట గుర్తొచ్చి నవ్వుకుంది వెంకట్రవణ.

"ఎందుకే రవణీ నవ్వుతున్నావ్" అన్నాడు సుందరేశం "అబ్బే ఈ ఆకులు చూస్తే బల్బు వెలిగినట్టయింది మీ మొహం, అందుకూ".

"ఏం చెయ్యమన్నావ్? ఎక్కళ్ళేని అలవాట్లూ చేసి 'నీ ఏడుపు నువ్వేడు' అన్నట్లు చక్కా పోయింది మీ పిన్ని. ఎన్నో ఏళ్ళయిపోయింది తాంబూలం మాట మరచి. కడుపారా అన్నం పెట్టడం కాక, మరి ఎక్కడ తెప్పించావో చెయ్యి తగిల్తే కందిపోయే తమలపాకులు చేరేశావ్".

"మీరిలా బస్సు దిగారని మా పైడమ్మ చెప్పడమేమిటి, అలా మనుషుల్ని పరిగెత్తించాను. ఇంతకీ లేకా, జరగకా మా ఇంటికి రారు కదా. ఆగండి. మీ మటుకు మీరే ఆకులు వేసుకుంటే నా గొప్ప ఏముంది? ఒకటీ ఒకటీ చిలకలు చుట్టి ఇస్తాను. అందుకుందురుగాని".

వెంకట్రవణ అందిస్తున్న తమలపాకు చిలకలు ఒకటీ ఒకటీ నోట్లో వేసుకుంటుంటే సుందరేశంగారి మనసు ఎంతో ఆర్ద్రమైపోయి అలా వెనక్కి వెనక్కి వెళ్ళిపోయింది. తనకి బాగా చిన్నప్పుడు వాళ్ళ మేనత్త అలాగే గుమ్మిడి గింజలు ఒలిచి ఒక్కొక్కటి అందించేది నోటికి, అలా

తినిపిస్తున్నప్పుడు ఏవేం చెయ్యాలో, చెయ్యకూడదో మనసుకి నాటేలా చెప్పేది. ఇప్పుడు ఇన్నేళ్ళ తర్వాత ఎక్కడో దూరపు చుట్టం ఈ వెంకట్రవణ చేస్తున్నదీ అదే.

అయితే, అంతటి సుందరేశం గారూ పోల్చుకోలేకపోయింది - ఈ సందర్భంలో - ఒకటే ఒకటి. లేత లేత చిలకలతో పాటు ఆమెకు మాత్రమే కలసి వచ్చేలా కమ్మకమ్మని కబర్లు కూడా జోడిస్తున్నదని.

"ఇందాకా ఏదో ముఖ్యమైన కబురుందన్నారు. ఇదేనా, దీని గురించేనా" అని వెంకట్రవణ వెండి కంచం తీసుకొచ్చి ఆయన చేతికిచ్చి, "తమ్ముడి తక్కువబుద్ధి నాకు తెలిసిందే గనక, పుచ్చుకున్నా ఇవ్వలేదంటారేమోనని ఇన్నాళ్ళూ ఆగేను. పొరపాటై పోయింది. సరే, చెయ్యెత్తి నమస్కారం పెట్టవలసిన మీలాంటి మనిషి ద్వారా అందజెయ్యడం కన్నా నాకు కావలసిందేముంది! ఇదిగో ఈ పెద్ద సంచీలో పెడుతున్నాను. మీరు వెళ్ళేటప్పుడు పట్టుకెళ్ళడం మరచిపోకండేం" అంది.

పరువు చుట్టకి అనుకుని పడుకున్న సుందరేశం చటుక్కున లేచి కూచున్నాడు. ఇంతటి ఉన్నతురాలినా ఆ దౌర్భాగ్యుడు ఇంత తక్కువ అంచనా వేసింది!

"వెళ్ళేటప్పుడు పట్టెగెడతాను లేవే. అందాకా బీరువాలో ఉంచెయ్యి. అది సరే గానీ నీ మొహం అలా ఉన్నట్టుండి ముడుచుకుపోయిందేమే రవణీ!"

అంతేకాదు, ఆ మాటతో ఆమె కళ్ళమ్మట గిర్రున నీళ్ళు తిరగడం కూడా ఆయన గమనించి తుళ్ళిపడ్డాడు. "ఏవేవో గుర్తొచ్చి నా మనసు తట్టుకోలేకపోయింది. అంతే, ఈ వెండి కంచానికి సంబంధించిందే ఎంత కథయినా ఉంది. అవన్నీ ఇపుడెందుకు? అయినా, నా వెర్రిగానీ చెట్టంత మా నాన్నే మటుమాయమై పోయాక ఇంకా ఈ వస్తువు మీద మమకారం దేనికి? ఏ కారణం చేతనైతేనేం పెద్దవారు మా ఇంటికొచ్చి పావనం చేశారు. అంతే చాలు".

"చూడొసే రవణీ, నీ చేత ఇవాళ ఇంతటి ఆదరణ పొందేను. నీ మనసులో ఉన్నదేదో వినకుండా వెళ్ళిపోతే ఆ వెలితి భరించలేను. వెండి కంచం గురించి నేనెరగంది ఏముందో చెప్పకపోయావో నేనిక్కణ్ణించి తీసికెళ్ళేదే లేదు, ఏమనుకున్నావో ఏమో!"

"మీరలా పట్టుపడితే తమ్ముడి గురించే ఎన్నో చెప్పవలసి వస్తుంది. అభిమానమంటే ఉందిగానీ, బాగా దూరాభారం అవడం చేత గత రెండేళ్ళుగా మా నాన్నా వాళ్ళింట్లో ఏం జరిగిందో మీకు తెలీదు. అమ్మ ఒంటి మీదున్న యాభై తులాల బంగారమూ, ఆడ పిల్లని గురివింద గింజ ఎత్తైనా నాకు దక్కకుండా చేసినా వాడు నా తమ్ముడు ఇంట్లో ఉన్న ఇంతింత ఇత్తడి గంగాళాలూ, అంతంత కంచు పాత్రలూ నిమిషాల మీద అమ్మేసుకుని సొమ్ము చేసుకున్నా వాడు నా తమ్ముడే. ఇంట్లో ఉన్న ఏ వస్తువుకయినా వాడికే అధికారం, మా మరదలిదే యాజమాన్యం. ఏదో మీలాంటి మంచి వాళ్ళ దీవెనల వల్ల మేం చల్లగానే ఉన్నాం. ఏం తిన్నా, ఎలా తిన్నా పైవాడు కాదు కదా. అనుభవించనియ్యండి. మా నాన్న తన చేతుల్తో తాను నా చేతులో పెట్టింది కూడా ఉంచుకోలేకపోయానే అని నా బాధ అంతే..."

బొటబొటా కారుతున్న కన్నీళ్ళని చూళ్ళేక పోయాడు సుందరేశం. "సొంత తమ్ముడి మీద నా నోట ఎందుకింకా నేరాలు కక్కిస్తారు! మళ్ళీ గుమ్మంలోకి రావద్దని తరిమికొట్టనీ. ఏళ్ళ తరబడా మాటలే మానెయ్యనీ, పెద్ద కర్మనాడైనా ఇంటి ఆడపడుచుకి నాన్నగారి ప్రసాదమైనా పట్టెడు ముద్ద పెట్టకపోనీ-వాడు నా రక్తం పంచుకు పుట్టిన వాడు కాకపోతాడా! నన్నింక కదపకండి. ఇప్పటికే కొంగున నిప్పు కట్టుకుని బతుకుతున్నాను. నాన్న గారి పేరు రాసి ఉన్న ఆ వెండి కంచం ఒక్కటైనా ప్రాణప్రదంగా దాచుకుని, 'ఇదిగో, మీ తాతగారు మీ అమ్మకి ఇదిచ్చార్రా' అని పిల్లలకి గర్వంగా చూపిద్దామనుకుని ఉవ్విళ్ళూరేను. కానివ్వండి. ఈ విషయంలో దయచేసి నన్నింకేం కదిలించవద్దు. దీన్ని తీసికెళ్ళి వాడి చేతిలో పెట్టి మళ్ళీ అదే ఆటోరిక్షామీద ఇక్కడికి రండి. కావలిస్తే అప్పుడు చెబుతాను."

వెంకట్రవణ అలా చెబుతున్న కొద్దీ సుందరేశం పట్టుదల మరీ పెరిగిపోయింది. ఆ వెండికంచం గురించి పూర్తిగా ఆమె నోట వినేదాకా ఆయనక్కణ్ణుంచి కదలదల్చుకోలేదు.

వెంకట్రవణ అదంతా చెప్పుకొచ్చింది. ఆమె తండ్రి ఇక నెల మించి బతకడని తెలిసిన సమయంలో జరిగిందిది. ఎప్పుడేం పాపం చేసుకుందో, ఊళ్ళో ఉన్నా, కన్న తండ్రిని కళ్ళతో అయినా చూడ్డానికి వీల్లేని దుఃస్థితి. తనెక్కడ వచ్చి ఇల్లేం కొల్లగొట్టుకుపోతుందో అని ఇరవై నాలుగ్గంటలూ ఆ వీధి అరుగు మీద ఎవరో ఒకరు కాపలా. తండ్రి అప్పుడప్పుడు అపస్మారక స్థితిలోకి కూడా వెళ్ళిపోతున్నాడని విని కడివెడు నీళ్ళకి మాత్రమే నోచుకున్న ఆడప్రాణి అవస్థ. ఎప్పట్నుంచో పని చేస్తున్న నమ్మకమైన పనిమనిషి పైడమ్మ ఇచ్చిన భోగట్టా ద్వారా ఆ అవకాశం కలిగింది. చావుకెదురు చూస్తున్న ఆ మనిషిని అలా గాలికి వదిలేసి ఇంటిల్లిపాదీ మ్యాటినీ సినిమాకి వెళ్ళిపోవడం కాదు గానీ తనకి ఆ యోగం దొరికింది.

ఆ గంట తండ్రితో ఏం మాట్టాడిందో అంతే, అదే ఆఖరి మాటా, చూపూ కూడానట. "అప్పుడు మా నాన్న నాతో ఏం చెప్పాడంటే" అంటూ వెంకట్రవణ ఇలా వివరించింది. "చూడొసే రవణీ, ఇలా దగ్గిరగా రా అమ్మా. నీ తల తడమనీ. ఎన్నాళ్ళకి చూశానే నిన్ను? ఇంత చిక్కిపోయావేమే తల్లీ? నీలాంటిదాన్ని గుమ్మంలోకి రానివ్వని దుర్మార్గపు వెధవని కొడుకని ఎలా చెప్పను! నిన్నెక్కడరానిస్తే నా తలని ఇంత కొరివి పెట్టక తగిలేస్తాడో అనే ఈ పిచ్చి తండ్రి వెర్రి నమ్మకాన్ని ఎవరితో చెప్పను! ఈ కబుర్లన్నీ ఎందుకు? ముఖ్యమైన సంగతి ఒకటుంది. విను. ఎందుకంటే, ఓసారి నాకు తెలివి ఉంటోంది. మరోసారి స్పృహ తప్పుతోంది. కాని ఓ అయ్య చేతిలో పెట్టానేగానీ, పసుపు కుంకంగా నీకేమీ ఇవ్వలేకపోయాననే చింత నన్ను కాల్చేస్తోంది. ఇక నీ తమ్ముడికీ, మరదలికీ అన్నావా, ఊరంతా ఊడ్చిపెట్టినా దాహం తీరదు. నా మంచం కింద ఓ సొరుగు లాంటిది ఉంది. వాళ్ళ డేగకన్ను ఇంకా దీని మీద ఎందుకు పడలేదో, అందులో నా వెండి కంచం ఒకటుంది. వెంటనే తీసుకు మీ ఇంటికిపో".

"మీ ఆశీస్సు వల్ల నాకున్నది నాకు చాలు. ఇలాంటిదింకా మీ దగ్గరొకటుండాలని వాళ్ళు పసిగట్టే ఉంటారు. నాకొద్దు నాన్నా".

"ఇది నా వస్తువు. నా ఇష్టం. నా పేరు చెక్కించుకున్నాను చూడు. నా జీవితకాలమంతా ఇందులోనే అన్నం తిన్నాను. నా ఇష్టమొచ్చిన వాళ్ళకి ఇచ్చుకుంటాను. వాడెవడు మధ్య? అన్నట్టు మరోటి గుర్తుంచుకో. ఇప్పటికే పెద్ద వెండి కంచమేమైందని రోజుకోసారైనా నన్ను మీ తమ్ముడు కొరుక్కు తింటున్నాడు. పోయిందని అబద్ధమాడేను. దొరికితే తనకే ఇవ్వాలని ఏ రోజుకారోజు బ్రెయిన్ వాష్ చేసి పారేస్తున్నాడు. నాకా ఎగ ఊపిరీ దిగ ఊపిరీ ఇలాంటి పరిస్థితిలో, ఒంటి మీద తెలివి లేని పరిస్థితిలో, ఏ పెద్దమనిషి ముందైనా, 'ఇది నా కొడుక్కే' దక్కాలని మాట తుళ్ళుతానో ఏమిటో ఒకవేళ అలాంటిది ఏమైనా నీ చెవిన పడినా లెక్క పెట్టకు రవణీ. ఇది నీ దగ్గరే ఉంచుకుంటాననీ, వండుకున్న పరమాన్నాన్ని ఏడాదికి ఒకసారైనా నువ్వూ, అల్లుడూ, పిల్లలూ నా కంచంలో తింటారనీ మాట ఇవ్వవే తల్లీ..."

"ఎన్ని ఎలా జరగనీండి. మీ లాంటి పెద్దలు వచ్చాక అది అప్పచెప్పడం నా ధర్మం" అంటూ వెండి కంచం తేవడానికన్నట్టు లేచింది వెంకట్రవణ. అయినా, ఆ అవసరం రాదని ఆమెకి తెలుసు. అంతటి జడ్జీగారూ హఠాత్తుగా లేచి బస్సు స్టేషన్‌కి ఆటో మాటాడుకుని వెళ్ళడం కిటికీ చాటు నుండి ఆమె గమనించనే గమనించింది.

★